అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- టీడీపీ హయంలో పథకాలన్నీ పార్టీ కార్యకర్తలకే
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: గత టీడీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ పథకాలన్నీ పచ్చచొక్కాల వారికే దక్కాయని ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా అన్నారు. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హత ఉంటే చాలు వారు ఏ పార్టీకి చెందినవారైనా, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 42వ డివిజన్ పరిధిలోని రవీంద్ర నగర్‌లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల వారికి కలుగుతున్న లబ్ధిని తెలుసుకున్నారు. ప్రజల సమస్యలు విని వాటికి పరిష్కార మార్గాలు చూపారు. ఈ సందర్భంగా షేక్ మలికా బేగం అనే మహిళ మాట్లాడుతూ తమ కుటుంబానికి వైఎస్సార్ పింఛన్ కానుక, జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్ సున్నావడ్డీ, వైఎస్సార్ చేయూత, జగనన్న ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి నగదు ద్వారా రూ.10.30లక్షల మేలు జరిగిందని సంతోషం వ్యక్తం చేసింది. షేక్ అయేషా అనే మహిళ మాట్లాడుతూ ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత తమ కుటుంబానికి వైఎస్సార్ ఆసరా, జగనన్న అమ్మ ఒడి, పింఛన్ కానుక, ఇంటి స్థలం ద్వారా రూ.9.90లక్షల లబ్ధి చేకూరిందని ఆనందం వ్యక్తం చేసింది. సాధు శ్రీదేవి అనే మహిళ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత తమ కుటుంబానికి వివిధ పథకాల ద్వారా రూ.9.45లక్షల మేలు జరిగిందని ఆనందం వ్యక్తం చేసింది. పేదలకు సాయం చేస్తున్న ఈ ప్రభుత్వమే కలకాలం ఉండాలని వారు ఆకాంక్షించారు. 42వ డివిజన్ ఇన్‌చార్జి చల్లా రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు బంగారు నాగయ్య, తోటక్రిష్ణ, మియ్యా, ఎన్.సుబ్బారెడ్డి, లక్ష్మయ్య, రామలక్షుమ్మ, ఖాజావలీ పాల్గొన్నారు.


గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

క్లుప్తంగా

నేడు నగర పాలక సంస్థలో స్పందన

కడప కార్పొరేషన్: కడప నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కార్పొరేషన్ కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. నగరవాసులు తమ సమస్యలను స్పందనలో తెలిపి పరిష్కరించుకోవాలని సూచించారు.

రేపు ఏపీజీబీ విశ్రాంత ఉద్యోగుల ధర్నా

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఏపీజీబీ విశ్రాంత ఉద్యోగుల పీఎఫ్ నిధులు చెల్లించాలని కోరుతూ మంగళవారం పీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు ఏపీజీబీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి జి.శివశంకర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది జనవరి నుంచి రిటైర్‌మెంట్ అవుతున్న ఏపీజీబీ విశ్రాంత ఉద్యోగులకు, కొత్త ఫ్యామిలీ పెన్షనర్స్‌కు రావాల్సిన ప్రావిడెంట్ ఫండ్ నిధులు, పెన్షన్ చెల్లింపులు కడప పీఎఫ్ ప్రాంతీయ కార్యాలయ సిబ్బంది నిలిపి వేయడం దారుణమన్నారు. వీటికి కారణమైన బ్యాంకు యాజమాన్యం, పిఎఫ్ కార్యాలయ సిబ్బందిపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమస్యలపై చేస్తున్న ధర్నాను ఏపీజీబీ విశ్రాంత ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

యూత్ కాంగ్రెస్ అభివృద్ధికి కృషి చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: యూత్ కాంగ్రెస్ అభివృద్ధికి కృషి చేయాలని కాంగ్రెస్ నాయకుడు బండి జకరయ్య పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని అశోక్‌నగర్‌లో నూతనంగా ఎన్నికైన యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండి సుమంత్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుమల్లేష్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో ఎంతో చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘమైన యూత్ కాంగ్రెస్‌ను బలోపేతం చేయడానికి నూతన నాయకత్వం కృషి చేయాలన్నారు. యూత్ కాంగ్రెస్ నాయకులు నరసింహ, పవన్, సాయి పాల్గొన్నారు.

రాజారావుకు మొల్లసాహితీ సేవా పురస్కారం ప్రదానం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శతావధాని నరాల రామారెడ్డి సాహితీ కార్యాలయంలో ఆదివారం హైదరాబాదుకు చెందిన పద్యకవి, చందస్సు నవ్యసాచి విద్వాన్ చక్రాల లక్ష్మీకాంత రాజారావుకు మొల్లసాహితీసేవా పురస్కారం ప్రదానం చేశారు. మొల్ల సాహితీ పురస్కారం, నగదు పారితోషికం, శాలువవ, జ్ఞాపికను ఆయనకు అందజేశారు. లక్ష్మీకాంత రాజారావు చేసిన సాహితీ సేవకు గాను ఈ పురస్కారాన్ని అందించినట్లు పీఠం వ్యవస్థాపకుడు గానుగపెంట హనుమంతరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో రచయిత జింకా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో అన్నదానం


ప్రత్యేక ఫాతెహా నిర్వహిస్తున్న మౌలానా స్వామి

కమలాపురం : పట్టణంలో వెలసిన దర్గా–ఏ–గఫారియాలో భక్తి శ్రద్ధలతో అన్నదానం నిర్వహించారు. రాజస్థాన్‌లోని అజ్మీర్ షరీఫ్‌లో వెలసిన హజరత్ ఖాజా గరీబ్ నవాజ్ ఉరుసు ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం స్థానిక పెద్ద దర్గాలో పీఠాధిపతి ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆధ్వర్యంలో ప్రత్యేక ఫాతెహా నిర్వహించారు. స్వామి వారి మజార్లపై పూలచాదర్లు సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పీఠాధిపతి సోదరులు మౌలానా స్వామి, సర్ఫరాజ్, పట్టణ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

చింతకొమ్మదిన్నె: కొత్తపేట–బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పట్టు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ముద్దలను ఏర్పాటు చేసి ఆభరణాలను, పట్టు వస్త్రాలను కానుకలుగా సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పార్వతమ్మగారి విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి సురేష్‌కుమార్‌రెడ్డిలు ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో బంధుమిత్రులతో విందుభోజనాలను చేశారు. అలాగే ఆలయ సమీపంలోని ఆంజనేయ స్వామి, సాయిబాబా, వైద్యనాథేశ్వరుడు, అక్క దేవతలు, వీరభద్రుడు, నవగ్రహాలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గ్రామీణ ప్రజలకు అందుబాటులో వైద్యసేవలు

కడప కార్పొరేషన్: గ్రామీణ ప్రజలకు హనమ్మ ఆస్పత్రి ద్వారా వైద్య సేవలు అందుబాటులోకి తేవడం అభినందనీయమని డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, శాప్ డైరెక్టర్ డేనియల్ ప్రదీప్ అన్నారు. ఆదివారం స్థానిక వాల్మీకినగర్‌లో డాక్టర్ శ్యామూల్ చక్రవర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హనమ్మ ఆస్పత్రిని వారు ప్రారంభించి మాట్లాడారు. నగర శివార్లలో ఉన్న వాల్మీకినగర్, అంగడి వీధి, భాకరాపేట, మామిళ్లపల్లె, తెలుగుగంగ కాలనీ, సాయిప్రతాప్ నగర్,రైల్వే కాలనీ వాసులకు ఈ ఆస్పత్రి అందుబాటులో ఉంటుందని వివరించారు. స్థానికులకు వైద్య సేవలను అందించడమే లక్ష్యంగా కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లకుండా అత్యవసరమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. ఆయా ప్రాంతాల ప్రజలు వీరి వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మేసా రాజశేఖర్, డేవిడ్‌రాజు, వినోద్, సివిల్ కాంట్రాక్టర్ సుమిత్ర పాల్గొన్నారు.


డాక్టర్ శ్యామూల్ చక్రవర్తితో అతిథులు

అధ్యాపకులకు పదోన్నతులు ఇవ్వాలి

– జీజేఎల్ఏ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేసే అధ్యాపకులకు డిగ్రీ కళాశాలలల్లో ప్రమోషన్లు ఇవ్వాలని ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజారావు డిమాండ్ చేశారు. ఆదివారం కడపలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జరిగిన ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకుల సంఘం జనరల్ బాడీ మీటింగ్‌లో వారు మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చాలా కాలం నుంచి ఖాళీగా ఉన్న ప్రిన్సిపల్స్ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయాలన్నారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో లెక్చరర్స్‌గా పనిచేస్తున్న లైబ్రేరియన్, పీడీ, ఎయిడెడ్ కళాశాలల్లో పనిచేసి ప్రభుత్వ కళాశాలలకు విలీనంపై వచ్చిన అధ్యాపకులకు సభ్యత్వ నమోదు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ అధ్యాపకుల సంఘంలో జిల్లాలు విభజన తర్వాత కడపజిల్లాలో రెండు ఆఫీస్‌బేరర్స్ ఖాళీలు ఏర్పడ్డాయన్నారు. త్వరలో ఆ ఖాళీలను భర్తీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రవి, జాయింట్ సెక్రటరీ రవీంద్రనాథరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ సభ్యులు రమణయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామక్రిష్ణారెడ్డి

గుర్తుకొస్తున్నాయి..

సాయిపేట హైస్కూల్లో ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


గురువులతో సాయిపేట హైస్కూల్‌కు చెందిన 1990-91 బ్యాచ్ విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: కడప నగరం సాయిపేట ఉన్నత పాఠశాలలో ఆదివారం 1990–91 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు జ్ఞాపకాల ఊయల్లో సేద తీరారు. ఒకరికొకరు ప్రేమ, అనురాగాలతో ఒరే.. మామ అంటూ ఆప్యాయంగా పలుకరించుకుంటూ ఆనాటి తీపి గుర్తులను నెమరువేసుకుంటూ మురిసి పోయారు. అనంతరం ఆటపాటలతో అలరింపచేశారు. అలాగే గురువులైన రామ్మూర్తి, సుబ్రమణ్యం శర్మ, లక్ష్మిరెడ్డి, నిస్సార్ అహ్మద్‌లను ఘనంగా సన్మానించారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ జెకె.పాలకొల్లు రాయుడు, పాలకొండరాయుడు, గోవర్ధన్, మస్తాన్, బాలచంద్రుడు, శివకుమార్, సాంబకుమార్, వెంకటేసు, పద్మ, సుజాత, వాణి, పుల్లమ్మ, భారతి పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా బాలాలయ సంప్రోక్షణ

వల్లూరు : మండల పరిధి దుగ్గాయపల్లెలోని గ్రామ దేవత గంగమ్మతల్లి, దత్తాత్రేయ స్వాముల ఆలయాల పునః నిర్మాణంలో భాగంగా ఆదివారం బాలాలయ సంప్రోక్షణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద పండితులు విజయ్ బట్టార్ ఆధ్వర్యంలో ఆలయంలో వివిధ హోమాలను, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పుణ్యాహవాచనం, కళశ స్థాపన కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం మూల విరాట్‌ల శక్తిని కళశాల్లోకి ఆవాహన చేశారు. కళశాలను, విగ్రహాలను బాలాలయంలోకి చేర్చి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు హోమ ప్రదక్షిణలు చేసి కాయ కర్పూరాలు సమర్పించారు. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందచేశారు.

పూజల్లో పాల్గొన్న ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్

స్వగ్రామమైన దుగ్గాయపల్లెలోని పురాతన ఆలయాల పునః నిర్మాణంలో భాగంగా జరిగిన బాలాలయ కార్యక్రమంలో ఏపీఎస్ ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు. పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం పండితులతో ఆలయ నిర్మాణం గురించి చర్చించి అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. సుమారు నాలుగు వందల సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ ఆలయాలు శిథిల దశకు చేరడంతో వాటిని తొలగించి వాటి స్థానంలో నూతన ఆలయాలను నిర్మించడానికి చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మాజీ జడ్పీటీసీ పచ్చారు వెంకటేశు, మాజీ సర్పంచ్ శంకర్‌రెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ నేతలు ఓబీ సుబ్బారెడ్డి, సిద్దారెడ్డి, జయచంద్ర, ప్రవీణ్‌రెడ్డి, సుబ్బయ్య, మునీంద్రారెడ్డి, వెంకటరెడ్డి, రాజారెడ్డి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న ఏపీఎస్ ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి

కార్పొరేట్ కంపెనీలకు కేంద్రం తొత్తు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు తొత్తుగా వ్యవహరిస్తోందని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో సీఐటీయూ అనుబంధ సంఘాల నాయకులతో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అంబానీ, అదానీలకు దేశ సంపదను తాకట్టు పెడుతోందని ధ్వజమెత్తారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్, నిత్యావసర సరుకుల ధరలను పెంచి ప్రజలపై భారం మోపిందన్నారు. మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయకుండా కొనసాగించాలన్నారు. ప్రతి ఉపాధి కూలీకి రోజుకు రూ. 600 కూలీ ఇవ్వాలన్నారు. ఈ సమస్యలపై ఏప్రిల్ 5న చలో డిల్లీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ సంఘాల నాయకులు కామనూరు శ్రీనివాసులు రెడ్డి, మనోహర్, అన్వేష్, గోపాలకృష్ణయ్య, దస్తగిరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి

గూగుల్ కన్నా గురువే మిన్న

కడప ఎడ్యుకేషన్: గూగుల్ కన్నా గురువే మిన్న అని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటరామిరెడ్డి అన్నారు. ఆదివారం కడప పట్టణంలోని విశ్వ హిందూ పరిషత్ సమావేశ మందిరంలో వారి అధ్యక్షతన నిర్వహించిన కర్తవ్యబోధ దివస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గురువుల ప్రత్యక్ష బోధనతో మాత్రమే విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఎన్ని సాంకేతిక విధానాలు వచ్చినప్పటికీ ఉపాధ్యాయుడు లేని విద్య రాణించదన్నారు. రాష్ట్ర సహాధ్యక్షురాలు రామోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు నాడు– నేడు పనిభారం తగ్గించి ఆ పనిని ఇతరులకు కేటాయించాలని అనవసరమైన యాపుల భారం తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు రామాంజనేయ ప్రసాద్ మాట్లాడారు. రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నయ్య, జిల్లా గౌరవాధ్యక్షుడు బాలానాయుడు, గౌరవ సలహాదారు రాధాకృష్ణయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటరామిరెడ్డి

తనిఖీల పేరుతో ఇబ్బంది పెట్టొద్దు

ఒంటేరు శ్రీనివాసులరెడ్డి

కడప ఎడ్యుకేషన్: ఆకస్మిక తనిఖీల పేరుతో ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టే చర్యలను రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ మానుకోవాలని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బోధనేతర పనులు, ఇతర విద్యాబోధనకు సంబంధించని పనుల వల్ల ఉపాధ్యాయులు ఇప్పటికే తీవ్ర ఒత్తిడిలో ఉన్నారని వారి సమస్యలను పరిష్కరించి ప్రోత్సహించాల్సింది పోయి వారిని భయబ్రాంతులకు గురి చేయడం సరికాదని పేర్కొన్నారు. తనిఖీల కన్నా ముందు ఉపాధ్యాయులకు రావాల్సిన పదోన్నతులు, సీపీఎస్ రద్దు, పీఆర్‌సీ, డీఏ బకాయిలు, వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

వాహనాల తనిఖీ

కడప అర్బన్: ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు పోలీసు అధికారులు, సిబ్బంది ఆదివారం విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అప్సర సర్కిల్‌లో ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి వాహనాల రికార్డులు పరిశీలించారు. డ్రైవింగ్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని వాహనదారులకు సూచించారు.

చక్రస్నానానికి పుష్కరిణి సిద్ధం

కడప కల్చరల్: దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో ఈ సంవత్సరం ఒక విశేషం చోటుచేసుకుంది. ఆలయ పుష్కరిణి ప్రస్తుతం నూతన ఆకర్శణలను సంతరించుకుంది. నెలరోజుల కిందట ఆలయాన్ని దర్శించుకున్న టీటీడీ జేఈఓ వీరబ్రహ్మయ్య సూచించిన మేరకు పుష్కరిణిని ఆకర్శణీయంగా తీర్చిదిద్దారు. నీటిని పూర్తిగా మార్చివేసి అడుగున నూతన ఫ్లోరింగ్ వేశారు. జంతువులు రాకుండా పుష్కరిణి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. డ్రైనేజీ నీరు పుష్కరిణిలో కలువకుండా వెళ్లేందుకు పక్కన కాలువలను ఏర్పాటు చేశారు. సోమవారం ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామికి చక్రస్నానం చేయించనున్నారు. ఈ ఉత్సవాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు నిర్ణీత సమయంలో పనులను పూర్తి చేసి అటు ప్రజలు, ఇటు అధికారుల ప్రశంసలు పొందడం విశేషం.

ఉత్సవ వివరాలు

దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం దేవునికడప మాడవీధుల్లో భక్తులు, ఆలయ నిర్వాహకులు, అర్చక బృందాలు వసంతోత్సవం నిర్వహించనున్నారు. అనంతరం ఆలయ పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా పుష్కరిణిలో స్వామి, అమ్మవార్లకు అవభృథస్నానము నిర్వహింపజేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు యథావిధిగా ఊంజల సేవ, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల భక్తిగీతాలాపనలు ఉంటాయి. రాత్రి 8.00 నుంచి 9.00 గంటల్లోపుగా హంస వాహనంపై స్వామిని మాడవీధుల్లో ఊరేగిస్తారు. 9.00 నుంచి 9.30 గంటల్లోపుగా ధ్వజావరోహణం చేయనున్నారు.



సామాజిక సేవలకే మానవత ప్రాధాన్యత

కడప కల్చరల్ : ప్రజలకు ఉపయోగపడే సేవలు అందించడానికే మానవత సంస్థ ప్రాధాన్యత ఇస్తుందని సంస్థ నగర అధ్యక్షులు సి.సుబ్బారెడ్డి అన్నారు. సంస్థ సమీక్షా సమావేశం ఆదివారం స్థానిక నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి ఏడాది కార్యక్రమాలను సమీక్షించారు. కేంద్ర కమిటీ సభ్యులు రామాంజులరెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా సంస్థ భవిష్యత్తులో చేపట్టనున్న సేవలను గురించి వివరించారు. ఈ సందర్భంగా పేదల కోసం రూ. 25 వేలు విలువజేసే 100 దుప్పట్లను అందజేశారు. రాజేశ్వరమ్మ మాట్లాడుతూ తమ తల్లిదండ్రుల పేరిట శాంతి రథాన్ని అందిస్తామని తెలుపగా, గునిశెట్టి సాయికుమార్ రూ. 40 వేలు విలువజేసే మైక్ సెట్‌ను అందజేశారు. ఎస్.సోమిరెడ్డి, సంస్థ జిల్లా కార్యదర్శి రెడ్డెన్న, నగర కార్యదర్శి వెంకట సుబ్బయ్య, ఇతరులు పాల్గొన్నారు. అనంతరం ఇటీవల గణతంత్ర దినోత్సవం నాడు ప్రశంసాపత్రం అందుకున్న సాంఘిక సంక్షేమశాఖ జేడీ జయప్రకాశ్‌ను సన్మానించారు.

మైనార్టీ కాలనీలో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు

చెన్నూరు : స్థానిక మూడవ వార్డు మైనార్టీ కాలనీలో సిమెంట్ రోడ్డు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇటీవల మైనార్టీ కాలనీలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డికి కాలనీ వాసులు రోడ్డుకు సంబంధించిన సమస్యను విన్నవించారు. 20 సంవత్సరాలుగా ఇక్కడ రోడ్డు పనులు చేపట్టక రోడ్డు గుంతల మయమై తాము అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన వెంటనే స్పందించి సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాల్సిందిగా ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్‌కు సూచిచడంతో ఆయన ఆధ్వర్యంలో మైనార్టీ కాలనీ మూడో వార్డులో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఈ విషయంగా స్థానికులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సాదక్ అలీ, ఉప సర్పంచ్ జుమస్, వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ నాయకులు సురతాని శ్రీనివాసులు, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శనేత వేంపల్లె దస్తగిరి

వీరపునాయునిపల్లె : బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచిన ఆదర్శ నేత వేంపల్లె దస్తగిరి అని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర అన్నారు. ఆదివారం మండలంలోని యు. నాజుపాలెం గ్రామంలోని దస్తగిరి వర్ధంతి సందర్భంగా ఆయన స్తూపం వద్ద ఘనంగా నివాళి అర్పించారు. పెత్తందారి విధానానికి స్వస్తి పలకాలని పోరాటం చేసిన వ్యక్తి దస్తగిరి అన్నారు. పోరాటంలో కీలక వ్యక్తి పాలెం చెన్నారెడ్డి ఉనికిని పుచ్చుకొని నిబద్ధతో ఆదర్శవంతమైన జీవితం గడిపాడన్నారు. గ్రామంలో ఏ ఒక్కరికి ఇబ్బంది కలిగినా తాను ఇబ్బందికి గురైనట్లు భావించి జిల్లా, రాష్ట్ర స్థాయి పార్టీ నాయకుల సమన్వయంతో సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో కమలాపురం ఏరియా కార్యదర్శి పి. చంద్రశేఖర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బాదుల్లా, గంగా సురేష్, విద్యార్థి నాయకులు పాలెం కొండారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దహన సంస్కారాలకు ఆర్థిక సాయం

చెన్నూరు : స్థానిక పార్కువీధికి చెందిన కల్లూరు మేఘన (18) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. ఈ విషయాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు డాక్టర్ పిచ్చయ్య పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గుమ్మా రాజేంద్రప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి సంతాపాన్ని తెలియజేస్తూ కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డికి చెందిన పోచిమరెడ్డి ఛారిటబుల్ ట్రస్టు ద్వారా మృతురాలి దహన సంస్కారాల నిమిత్తం రూ.5 వేల ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

బకాయిలను చెల్లించాలి

యూటీఎఫ్ డిమాండ్


మాట్లాడుతున్న లక్ష్మీరాజా

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు అవసరాలకు కోసం దాచుకున్న పీఎఫ్, ఏపీ జీఎల్ఐ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు డిమాండ్ చేశారు. ఆదివారం కడప యూటీఎఫ్ భవనంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రెండేళ్లుగా బకాయిలు పేరుకపోయి ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సరెండర్ లీవ్స్‌కు సంబంధించి ట్రెజరీలకు బిల్లులు సబ్మిట్ చేసి రెండు మూడు సంవత్సరాలు కావస్తున్నా బిల్లులు రాకపోవడం శోచనీయం అన్నారు. ఇప్పటికైనా ఉద్యోగ, ఉపాధ్యాయుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వారు దాచుకున్న డబ్బులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు మస్తానయ్య, దావుద్దీన్ నాయకులు సివిరమణ, సుబ్బారెడ్డి, జువేద్, సూర్యకుమార్, శివశంకర్, రఫిక్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో కళాకారుల సందడి


శిల్పారామంలో యువకుల నృత్య ప్రదర్శనలు

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై కళాకారులు తమ ఆటపాటలతో సందడి చేశారు. కళాకారులు పలు జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. సామాజిక అంశాలపై పలు కామెడీ స్కిట్‌లను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. శిల్పారామం పాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు. రికార్డులను పరిశీలిస్తున్న కడప చిన్నచౌక్ ఎస్ఐ అమర్‌నాథరెడ్డి

ఘనంగా ఉరుసు

జమ్మలమడుగు : అజ్మీర్ ఖాజా గరిబున్‌నవాజ్ 811వ ఉరుసు మహోత్సవం సందర్భంగా పట్టణంలోని ఆస్థానయే గౌసియా పీఠాధిపతి, ప్రభుత్వ ఖాజీ సయ్యద్ షా గౌస్‌పీరాఖాద్రీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పీఠాధిపతి నివాసం నుంచి జెండా ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పక్కీర్లు చేసిన మేళా భక్తులను అలరించింది. అనంతరం జెండాలను దస్తగిరి స్వామి దర్గాల వద్ద ఎక్కించారు. దర్గా వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.